www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 అక్టోబర్ 2025
5
వైఎస్ఆర్

## సిజెఐపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఇఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా చర్య తీసుకోవాలని కోరారు. తక్షణం అరెస్టు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండలం అధ్యక్షులు ఒడ్డెపోగు తిమోతి, ఉపాధ్యక్షులు కిన్నెర కిరణ్, ఎంఇఎఫ్ అధ్యక్షులు సగిలి ప్రసాద్, ఎంఆర్‌పిఎస్ మండల అడ్వైసర్ సగిలి రాయప్ప, గుడిమే సుదర్శన్, ఎస్‌సి సెల్ కార్యదర్శి సత్యం, ఓబులేసు, నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల వేడి షురూ!

- కడప, పులివెందులపై పార్టీల ఫీట్లు
- తెలుగుతమ్ముళ్లలో ఎడతెగని తగవులు
- పులివెందుల చైర్మన్ వైసిపి అభ్యర్థిగా దుష్యంత్‌రెడ్డి!?
- 28 నుంచి మున్సిపోల్స్‌పై శిక్షణా తరగతులు

**జిల్లాలో మున్సిపల్ ఎన్నికల వేడి రాజుకుంటోంది. కడప కార్పొరేషన్ మేయర్, పులివెందుల మున్సిపల్ చైర్మన్ పదవులకు తెలుగుతమ్ముళ్లలో నువ్వానేనా అనే రీతిలో పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. కడప కార్పొరేషన్ మేయర్ పీఠంపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ పదవికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.టెక్ రవి కుటుంబీకులు లేదా ఎంపిక చేసిన వ్యక్తులు ఉండాలనే రాజకీయాల నేపథ్యం ఉత్కంఠను కలిగిస్తోంది. ప్రత్యర్థి వైసిపి పులివెందుల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా చవ్వా దుష్యంత్‌రెడ్డిని దాదాపుగా ఎంపిక చేసిన దగ్గర నుంచి చాపకింద నీరులా పావులు కదుపుతోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 28న విజయవాడలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల శిక్షణా తరగతులకు మున్సిపల్ అధికారులు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు తమదైన వ్యూహాలకు పదును పెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.**

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో కడప కార్పొరేషన్, కమలాపురం, మైదుకూరు, బద్వేల్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, రాజంపేట, రాయచోటి మున్సిపాలిటీలు ఉన్నాయి. జిల్లాలోని కడప కార్పొరేషన్‌తో సహా మిగిలిన ఎనిమిది మున్సిపల్ చైర్మన్ పదవులు దక్కించుకోవడంపై అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి కన్నేశాయి. జిల్లాలో రాజకీయ చైతన్యం కలిగిన స్థానిక సంస్థలైన కడప కార్పొరేషన్, పులివెందుల మున్సిపాలిటీల్లో రాజకీయం వేడెక్కింది. కడప కార్పొరేషన్ పీఠంపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కుటుంబాల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. కడప, కమలాపురం ఎమ్మెల్యేలు తమ కుటుంబీకులుగానీ, అనుచరులు గానీ 50 కార్పొరేటర్ల స్థానాలు మొదలుకుని మేయర్ వంటి కీలక పదవులను దక్కించుకోవాలని పావులు కదుపుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కడప నియోజకవర్గంలోని అసంతృప్తుల దగ్గర నుంచి గ్రావెల్ తరలింపు వాహనాల సీజ్, జిజిహెచ్‌లోని శానిటేషన్, సెక్యూరిటీ, ఆరోగ్యశ్రీ కాంట్రాక్టుల వరకు అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ప్రత్యర్థి వైసిపి అధికార పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులకు తమ హయాంలో నిధులు మంజూరు చేశామనే పేరిట పోటాపోటీగా రాజకీయం చేస్తుండడం ఉత్కంఠను కలిగిస్తోంది. పులివెందుల మున్సిపల్ ఎన్నికలను పరిశీలిస్తే అధికార వైసిపికి ఇటీవలి జడ్‌పిటిసి ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాల నేపథ్యంలో 33 వార్డు స్థానాలకు అభ్యర్థుల ఎంపిక, చైర్మన్ పదవికి అభ్యర్థి ఎంపిక వరకు జాగ్రత్తగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. పులివెందుల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని దాదాపుగా చవ్వా దుష్యంత్‌రెడ్డి పేరును దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బి.టెక్ రవి ముగ్గురు అభ్యర్థుల పేర్లను ఎంపిక చేసుకుని ప్రకటించలేని డోలాయమానంలో పడినట్లు సమాచారం. మున్సిపాలిటీలోని 33 వార్డులకు టిడిపి అభ్యర్థుల ఎంపిక విషయంలో తపస్సు చేయాల్సి ఉంటుందనే వాదన వినిపిస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాబోయే డిసెంబర్ మాసంలోపు రాష్ట్రంలోని మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమాయత్తం కావాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈలెక్కన ఫిబ్రవరి, మార్చి మాసాల్లోపు మున్సిపల్ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈనెల 28న విజయవాడలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన శిక్షణా తరగతులకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల రాజకీయం మరింత ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి.

# పెద్దదర్గా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

**- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్**

ప్రజాశక్తి - కడప

నవంబర్ 4 నుండి 10వ తేదీ వరకు జరగనున్న అమీన్‌పీర్ పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో ఉత్సవాల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్త ప్రాముఖ్యం కలిగిన అమీన్ పీర్ దర్గా ఉత్సవాలను కడప నగర ఫెస్టివల్‌గా మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా స్టాండర్డ్ నిబంధనలను పాటిస్తూ ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 15 రోజుల ముందుగానే ముందస్తు ప్రణాళికతో అన్నిరకాల ఉత్సవ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. పెద్దదర్గా కమిటీ సభ్యులు, జిల్లా యంత్రాంగం, అన్ని శాఖల అధికారులు, దర్గా మేనేజ్‌మెంట్, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. భక్తులకు, విఐపిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతంలో పెద్దదర్గా ఉరుసు నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎస్‌పి నచికేత్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లను చేస్తామన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెసి అదితి సింగ్ మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాలకు సంబంధించి ఆయా శాఖలకు కేటాయించిన అధికారులు విధులు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు, ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, జిల్లా మైనారిటీ ఆఫీసర్ ఇదయతుల్లా, ఎఎస్‌పి ప్రకాష్ బాబు, జిల్లా సమాచార శాఖ అధికారి పద్మజ, విద్యుత్ ఎస్ఇ రమణ, డిఎంహెచ్ఒ నాగరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రాకేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

సిఎం చంద్రబాబును ఉరుసు ఉత్సవాల ఆహ్వానిస్తున్న పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని

**ఉరుసు ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం**

**కడప అర్బన్ :** పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని ఆహ్వానించారు. శనివారం తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పేరొందిన ఈ ఉరుసు ఉత్సవాలు నవంబర్ 5 నుంచి 10వ తేదీ వరకు ఉంటాయని తెలిపారు. ఉత్సవాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ముఖ్యమంత్రిని కోరారు. ఉరుసు ఏర్పాట్లు ఏ విధంగా జరుగుతున్నాయని సిఎం వారిని అడిగి తెలుసుకున్నారు. ఉరుసుకు సహకారం అందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. సిఎంను కలిసిన వారిలో పెద్దదర్గా మేనేజర్ మొహమ్మద్ అలీఖాన్, బాఖీ ఉల్లాఖాన్ ఉన్నారు.

నిత్యావసర వస్తువులు అందుకుంటున్న రఫీ

## 'అల్‌షిఫా'కు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని పాత రిమ్స్‌లో ఉన్న అల్‌షిఫా మానసిక దివ్యాంగుల కేంద్రానికి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ మేనేజర్ కృషాకఫరెడ్డి, సిబ్బంది సహకారంతో నిత్యావసర వస్తువులు అందజేశారు. శనివారం వీటిని అల్‌షిఫా వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీకి వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ డొనేషన్ బాక్స్‌లో వచ్చిన మొత్తం కృష్ణారెడ్డి నిత్యావసర వస్తువులను అందించడం సంతోషంగా ఉందన్నారు. మానసిక వికలాంగులకు జాలి, దయ చూపించడంతోపాటు అన్ని రకాలుగా చేయూతనందించాలని కోరారు. ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేనేజర్ రాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## మోడీ సభకు రూ.400 కోట్లు దుర్వినియోగం

ప్రజాశక్తి-కడప

ప్రధాని నరేంద్ర మోడీ కర్నూలు సభకు కూటమి ప్రభుత్వం సుమారు రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ అన్నారు. కడపలోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వార్థ, వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకు కర్నూలు సభ వేదికగా మారిందన్నారు. ఒకరినొకరు పొగడ్తలతో ప్రసంగించడం పట్ల ప్రజలు నవ్వుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లేదా రాయలసీమకు ఈ సభ ద్వారా ఎలాంటి ప్రయోజనం చేకూరాలేదన్నారు. నరేంద్ర మోడీని అబద్ధపు పొగడ్తలతో ముంచెత్తడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోటీ పడటం పట్ల ప్రజలు అసహ్యించుకున్నారన్నారు. కడప స్టీల్ ప్లాంట్, కర్నూల్లో రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటు వంటి అభివృద్ధి, ఉపాధి కల్పన ప్రాజెక్టుల గురించి ఊసే లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింన ఘన చరిత్ర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలదే నన్నారు. కేంద్ర రాష్ట్రాల్లోని ఎన్‌డిఎ ప్రభుత్వాలు ప్రజలను తీవ్రంగా మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ దుర్మార్గపు ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

## విమర్శలు చేసినవారే పార్టీలు మారారు

ప్రజాశక్తి-కడప అర్బన్

తనపై విమర్శలు చేసిన వారిలాగా తాను పార్టీలు మారనని, మరణించే వరకు టిడిపిలో కొనసాగుతానని ఆ పార్టీ అసంతృప్తి నేత మాబుల్లా అన్నారు. నగరంలోని టిడిపి మైనార్టీ డివిజన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను వైసిపి నేతలు అంజద్‌బాష, రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి ఉన్న ఫోటోను చూపించి సందర్భాన్ని తెలుసుకోకుండా మాట్లాడటం తగదన్నారు. 2018లో రంజాన్ మాసంలో తాను కువైట్‌లో ఉన్న సమయంలో వైసిపి నేతలు ఇఫ్తార్ విందుకు వచ్చి వైసిపి కండువా వేసుకుంటే మీ ఆతిథ్యాన్ని స్వీకరిస్తామని చెప్పడంతో అప్పటికప్పుడు ఆ పార్టీ కండువా వేశారన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత వైసిపి కండువా తీసివేస్తూ తాను టిడిపిలోనే ఉంటానని, మరణించేవరకు పార్టీని వీడేది లేదని వారికి స్పష్టం చేశానన్నారు. తనను విమర్శించిన టిడిపి నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్‌తోపాటు ఆయన తండ్రి ఖాసింఖాన్ రాజకీయ చరిత్ర అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. వైసిపి నుంచి టిడిపిలోకి వచ్చిన కార్పొరేటర్లు తొలుత రాజీనామా చేసి మాట్లాడాలన్నారు. వైసిపి నేతలు టిడిపిని భ్రష్టు పట్టించేందుకు ఆయా నేతలను పంపినట్లు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. వైఎస్ఆర్ సిఎం అయ్యాక తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని, ఆయన మరణం తర్వాత జగన్ వద్దకు వెళ్లలేక టిడిపి కండువా కప్పుకుని నేటి వరకు కొనసాగుతున్నానని తెలిపారు. సమావేశంలో షాప్ మాజీ డైరెక్టర్ జయచంద్ర, డైరెక్టర్ వహీద్ ఆసిఫ్, 31, 32, 35, 39, 47వ డివిజన్ల ఇన్‌ఛార్జులు ఆరిఫ్‌ఖాన్, ఆజాద్ అహ్మద్, చాంద్‌బాషా, మహమ్మద్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో ఫొటోలు ప్రదర్శిస్తున్న నాయకులు

# సమ్మె విరమణ శోచనీయం : స్ట్రగుల్ కమిటీ

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యుత్ కార్మికుల ప్రధాన డిమాండ్స్ నెరవేరకుండా సమ్మె విరమణ నిర్ణయం శోచనీయమని స్ట్రగుల్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని విద్యుత్ భవన్ ఎస్ఇ కార్యాలయం ఆవరణంలో స్ట్రగుల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ప్రధాన డిమాండ్లుగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్ల రెగ్యులర్, గ్రేడ్-2 సమస్యలు, పాత పెన్షన్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. లేని పక్షంలో సమ్మె చేస్తామని సోదర జెఎసి సమ్మెకు పిలిపిచ్చిందని తెలిపారు. ఇదే అంశాల మీద అప్పటికే జిల్లాలలో డిస్కముల వద్ద, గత నెలలో విద్యుత్ సౌదా వద్ద ధర్నా కూడా నిర్వహించారని చెప్పారు. జెఎసి కూడా ఇదే ప్రధాన డిమాండ్స్‌గా సమ్మెకు పిలిపివ్వడంతో స్ట్రగుల్ కమిటీగా వారికి మద్దతుగా మేము సిద్ధమయ్యామని పేర్కొన్నారు. డిమాండ్స్ నెరవేరకుండా మధ్యలో జెఎసి సమ్మె విరమించుకోవడం శోచనీయమని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నాయబ్ రసూల్, డిస్కం అధ్యక్షుడు ఎస్.శివశంకర్, యూనియన్ కోశాధికారి సురేంద్ర, నాగమల్లయ్య పాల్గొన్నారు. **బద్వేలు:** కార్మికుల ప్రధాన డిమాండ్స్ నెరవేరే వరకూ దశల వారి పోరాటాలు చేస్తామని స్ట్రగుల్ కమిటీ నాయకులు కె.శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ కో-కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, గోపాల్, కార్మికులు తిరుపాల్, పోలిరెడ్డి, జాన్సన్ పాల్గొన్నారు. **దువ్వూరు :** కార్మికుల ప్రధాన డిమాండ్స్ నెరవేరేవరకు దశల వారి పోరాటాలు చేస్తామని యుఇఇయు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయబ్ రసూల్, జిల్లా అధ్యక్షులు బి.ఎన్.నాగసుబ్బయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించడం వల్ల రూ.200 కోట్ల సంస్థకు మిగులుతుందని తెలిపారు.

మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

## 'మూల'కు 'సాహిత్య కళానిధి' పురస్కారం

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి సాహిత్య, కళా, ఆధ్యాత్మిక రంగాలకు చేస్తున్న విశేషమైన కృషికి గుర్తింపుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, హైదరాబాద్ వారు 'సాహిత్య కళానిధి' జాతీయ లెజెండరీ పురస్కారాన్ని ప్రకటించినట్లు సంస్థ అధ్యక్షులు బిక్కి కృష్ణ తెలిపారు. పురస్కారాన్ని మల్లికార్జునరెడ్డి ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో అందుకోనున్నారు. కవిగా, రచయితగా, విమర్శకునిగా మల్లికార్జునరెడ్డి ఇప్పటికే 20పైగా పుస్తకాలు రాశారు.

మూల మల్లికార్జునరెడ్డి

**శ్రీరామనాథ్‌కు గడియారం సాహిత్య...**

శ్రీరామనాథ్

యువకవి పరిమి శ్రీరామనాథ్ 'మహాకవి' డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి 44వ సాహిత్య పురస్కారానికి ఎంపికైనట్లు రచన సాహిత్య వేదిక కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురస్కార ప్రదాన సభ రచన సాహిత్య వేదిక, గడియారం కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన ప్రొద్దు టూరులోని అరవిం దాశ్రమంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. 1982 నుంచి ప్రతి ఏటా రాష్ట్రస్థాయిలో కావ్యాలకు పోటీ నిర్వహించి ఎంపికైన కావ్యానికి బహూకరిస్తూ వస్తున్న ఈ అవార్డుకు 2025 సంవత్సరానికి పరిమి శ్రీరామనాథ్ రచించిన 'జీవాతువు' అనే కావ్యం ఎంపికైనట్లు పేర్కొన్నారు. పురస్కార ప్రదాన సభలో శ్రీరామనాథ్‌కు కవి సన్మానం, అవార్డుకు గాను రూ.10 వేలు నగదు బహుమతి, పురస్కారపత్రం, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

## యువత రక్తదానంలో ఆదర్శంగా నిలవాలి

**- వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ**

ప్రజాశక్తి-కడప అర్బన్

రక్తదానంతో ప్రమాదాల్లో గాయపడిన, రక్తహీనత కలవారి ప్రాణాలు నిలపవచ్చని, యువత ఆరు నెలలకోసారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ కోరారు. విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి, కడప రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో వైవీయూ హెల్త్ సెంటర్లో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి, హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ నరేష్ కుమార్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన వ్యక్తులు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తహీనత వ్యాధిగ్రస్తులకు మనమిచ్చే రక్తం జీవితాన్నిస్తుందని రక్తదాన శిబిర నిర్వాహకులు వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. రిమ్స్ బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ రాజేందర్, నర్సింగ్ ఆఫీసర్లు సృజన, సుహాసిని, టెక్నీషియన్స్ ఆర్.ఎల్.నరసింహులు, చంద్రారెడ్డి, వసంత, సిబ్బంది హరి, వెంకట్రామిరెడ్డి, విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్వీ వెంకటరమణ, ఆచార్య అనిత, డాక్టర్ కె. శ్రీనివాసరావు, డాక్టర్ సునీత, డాక్టర్ లలిత, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, పిఆర్‌సెల్ డైరెక్టర్ డాక్టర్ సరిత పాల్గొన్నారు.

## తల్లిదండ్రులతో స్నేహ పూర్వకంగా ఉండాలి

ప్రజాశక్తి - కడప

పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా ఉండాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ మరియు సాధికారతాధికారి పి.రమాదేవి అన్నారు. శనివారం కలెక్టరేట్లోని ఐసిడిఎస్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల యొక్క విద్యా ప్రాముఖ్యత,అంతర్జాతీయ బాలిక దినోత్సవ విశిష్టతను వివరించారు. తల్లిదండ్రులు పిల్లలతో వీలైనంత ఎక్కువగా మాట్లాడాలని, వారితో తల్లిదండ్రులు స్నేహంగా ఉన్నట్లయితే వారి యొక్క సమస్యలు తెలుస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వము అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని బాలికలు అభివృద్ధి చెందాలని, బాలికలు అన్నీ రంగాలలో కూడా ముందజలో వున్నారని తెలియజేశారు. లీగల్ ఎయిడ్ ఆఫీసర్ ఎన్.హరిబాబు మాట్లాడుతూ దేశంలో ఉన్న బాలికలు, మహిళలకు డిఎల్ఎస్ఎ ద్వారా వారికి ఉన్న చట్టాల గురించి తెలియజేస్తూ వారి ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలియజేశారు. డిఇఎంఒ డి.భారతి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికల విద్య కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాల ద్వారా బాలికల, మహిళల అభివృద్ధికి సహాయం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో బాలికల నిష్పత్తి తక్కువగా వుందని, భ్రూణ హత్యలు నేరమని, అలా చేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడుతుందని తెలియజేశారు. బాల్యవివాహాలు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కడప అర్బన్ సిడిపిఒ జె.వాణి, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ ఎన్.శోభారాణి, మిషన్ వాత్సల్య సిబ్బంది, మిషన్ శక్తి సిబ్బంది, మహిళా పోలీసులు, ఐసిడిఎస్ సూపర్ వైజర్‌లు, డిఎల్ఎస్ఎ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహమ్మద్‌ను అభినందించిన ప్రిన్సిపల్

**ప్రజాశక్తి - కడప:** సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ పోటీల్లో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, విద్యా శాఖామంత్రి నుంచి అవార్డు పొందిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ఖుషి మహమ్మద్‌ను శనివారం ఆర్ట్స్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.రమేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమణ రావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి

**ప్రజాశక్తి-బద్వేలు:** ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆర్థికపరమైన అంశాల్లో వంచనకు గురి చేయవద్దని ఎస్‌టియు జిల్లా శాఖ అధ్యక్షుడు ఇలియాస్ బాష కోరారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో ఎస్‌టియు రీజియన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు, ఉద్యోగులందరికీ ఐఆర్ ప్రకటించి, 12వ పిఆర్‌సి కమిషన్‌ను తిరిగి నియమించి నిర్ణీత కాలంలో నివేదిక అందించి 12వ పిఆర్సి అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం రీజియన్ కన్వీనర్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బద్వేల్, బ్రహ్మంగారిమఠం, గోపవరం, అట్లూరు మండలాలకు రాబోయే రెండు సంవత్సరాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, కె.బాలగంగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, ఎన్.వి.సుబ్బయ్య, రవి కేశవ్, పద్మనాభరావు, జకరయ్య, బి.ఎన్.శివరాజ్, వెంకట లక్ష్మమ్మ, జి.భారతి, ఎం.రామసుబ్బయ్య, రమేష్ రాజా, నరసింహారెడ్డి, మునెయ్య, శిద్దారెడ్డి, శ్రీకాంత్, తిరుపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## కార్మికులకు సంఘీభావంగా నిలుద్దాం

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆశ, ఐసిడిఎస్, మిడ్ డే మీల్, గార్మెంట్ రంగాల్లోని శ్రమదోపిడికి గురవుతున్న మహిళా కార్మికుల ఆందోళనలకు బీమా, బ్యాంకింగ్, తదితర రంగాల్లోని మహిళా ఉద్యోగులు సంఘీభావంగా నిలవాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జోనల్ మాజీ ఉపాధ్యక్షులు ఎస్.కె.గీత పిలుపునిచ్చారు. ఎల్ఐసి డివిజనల్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎల్ఐసి యూనియన్ 14వ శ్రామిక మహిళా సదస్సు వై.శ్రీవాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సును ప్రారంభించిన ముఖ్యఅతిథి ఎస్.కె.గీత మాట్లాడుతూ దేశంలో పెరిగిపోతున్న ఉపాధి కాంట్రాక్టీకరణ వల్ల ఆదాయాలు తగ్గి, పొదుపు మదుపు తగ్గి, బీమా రంగ సంస్థలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఈ శ్రమదోపిడికి గురవుతున్న రంగాల కార్మిక వర్గ పోరాటాలకు మనం సంఘీభావంగా నిలవాలని పేర్కొన్నారు. గౌరవ అతిథి, ఎపి రాష్ట్ర ఎల్ఐసి శ్రామిక మహిళా కన్వీనర్ జి.సూర్యప్రభ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం చట్టబద్ధత ఇచ్చిన 13 గంటల పని విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సదస్సులో యూనియన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్ మాట్లాడారు. మహిళలకు రక్షణ కవచమైన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ప్రభుత్వ విమారంగాన్ని బలహీనత పరిచే ప్రయత్నాలను వ్యతిరేకించాలని సదస్సు తీర్మానించింది. కన్వీనర్ పి.వసుప్రద ప్రవేశపెట్టిన కార్యవర్గ నివేదికను సదస్సు ఆమోదించింది. సదస్సులో యూనియన్ ముఖ్యులు అక్బర్ బాషా, సూరిబాబు, వారిజాతమ్మ, పర్వీన్, లీలాలక్ష్మి, రాజు, అయ్యవారురెడ్డి, కుమార్, రత్న కిషోర్, చిన్నయ్య, సాదక్ పాల్గొన్నారు. ఎల్ఐసి శ్రామిక మహిళల విభాగం నిర్వహించిన వక్తృత్వ పోటీలో విజేతలైన ఆర్ట్స్ కాలేజీ, కోటిరెడ్డి మహిళా కళాశాల విద్యార్థినులకు, వ్యాసరచన పోటీలో విజేతలైన మహిళా ఉద్యోగులకు సదస్సులో బహుమతులు అందజేశారు. వచ్చే ఏడాదికి నిర్వహించే శ్రామిక మహిళా సదస్సుకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా డి.శ్రీకృష్ణ (కడప), కో-కన్వీనర్లుగా పి.వసుప్రద (కడప), వై.శ్రీవాణి (కడప), జి.పద్మజాలత (కడప), ఆర్కే లత (ఆదోని), కె.సుచిత్ర (ఆత్మకూరు), పి.లక్ష్మీదేవి (అనంతపురం-1), బి.ఎస్.వెంకట పృథ్వి (తాడిపత్రి), నూతన శ్రామిక మహిళా కన్వీనర్ డి.శ్రీకృష్ణవందన సమర్పణ సదస్సు ముగిసింది.

మాట్లాడుతున్న ఎల్ఐసి యూనియన్ మాజీ జోనల్ ఉపాధ్యక్షులు గీత

## నిరసన

ప్రజా'దృష్టి'

జిల్లాలో ఇటీవల నిరసనల జోరు పెరిగింది. రాష్ట్రంలోని కూటమి సర్కారు మెడికల్ కళాశాలలను పిపిపి మోడ్‌లో పందేరానికి పెట్టడంపై సర్వత్రా నిరసన వ్యక్తమంది. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలను ప్రయివేటుకు దారాదత్తం చేయడంపై ప్రజా సంఘాలు సంతకాల సేకరణ, నిరసనల ద్వారా ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశాయి. ప్రయివేటుకు, పిపిపి విధానానికి తేడా తెలియదా అని కూటమిపెద్దలు ఎదురుదాడి చేయడం విమర్శలకు సైతం నివ్వెరపరిచింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మెడికల్ కళాశాలలపై కన్నేసింది. వైసిపి హయాంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు చేపట్టింది. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మెడికల్ కళాశాలలను ప్రారంభించకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలకు చెందిన 150పైగా మెడికల్ సీట్లను పేదపిల్లలకు అందకుండా అన్యాయం చేసింది. అనంతరం పిపిపి పేరుతో తమ వందిమాగదులకు 33 ఏళ్ల లీజు పేరిట కట్టబెట్టి పెద్దఎత్తున దోపిడీ చేసుకోవడానికి తెరదీసింది. పిపిపి విధానాన్ని వ్యతిరేకించిన అసమ్మతులను గద్దించడం, బెదిరించడం వంటి సామ, ధాన, బేధ, దండోపాయాల ద్వారా నిరసనకారుల గొంతునొక్కే ప్రయత్నం చేసింది. కడప టిడిపిలో నిరసనల జోరు పెల్లుబికుతోంది. స్వల్పవ్యవధిలోనే అసంతృప్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. టిడిపి కడప నగర కమిటీ దగ్గర నుంచి జిల్లా అధ్యక్ష పదవుల ఎంపిక చేయడం వరకు అసంతృప్తుల సెగ తగులుతోంది. ఫలితంగా కడప జిల్లాలో టిడిపి ప్రాభవం క్రమేణా తరిగిపోతోందనే వాదన వినిపిస్తోంది. కూటమి సర్కారుకు అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలో ఇంతటి స్థాయిలో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడం దేనికి సంకేతమో ఆలోచించుకోవాలి. గండికోట పర్యాటక ప్రాజెక్టు అభివృద్ధి పనులకు బిజెపి ఎమ్మెల్యే, ఎంపీల మధ్య నెలకొన్న అనైక్యత అడ్డంకిగా మారిన సంగతి తెలిసిందే. బిజెపి నాయకుల మధ్య సయోధ్య కుదిర్చే వ్యవహారాన్ని కలెక్టర్‌కు అప్పగించడం ఏమిటో తెలియడం లేదు. గండికోట పర్యాటక ప్రాజెక్టు దగ్గర జరిగిన అడ్డంకుల గురించి కలెక్టర్‌కు తెలియకుండా ఉండదనే సంగతిని గ్రహించాలి. కలెక్టర్ పరిధిలో పరిష్కారమయ్యే వ్యవహారమైతే ఎప్పుడో పరిష్కరించి ఉండేవారనడంలో సందేహం లేదు. కలెక్టర్ పరిధిని దాటడం వల్లే పీఠముడి ఏర్పడింది. ఈ పరిస్థితిని అర్థం చేసుకోని సిఎంఒ బంతిని కలెక్టర్ కోర్టులోకి విసరడం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదనే వాదన వినిపిస్తోంది.

**- ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

బంగారు కుటుంబం సభ్యులతో ఎమ్మెల్సీ, ఆయన సతీమణి ఉమాదేవి

## పేదరిక నిర్మూలనే పి4 లక్ష్యం : ఎమ్మెల్సీ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పేదరికాన్ని నిర్మూలించడానికి పి4 పథకం ప్రవేశ పెట్టారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదరిక నిర్మూలించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. పేదలకు సంపన్నులు సాయం చేసే ఆదుకోవడం దీని లక్ష్యమన్నారు. ప్రజా ప్రతినిధులే కాకుండా స్వచ్ఛంద సంస్థ, వ్యాపారులు, ఉద్యోగులు, సంపన్నులు తమతమ పరిసర ప్రాంతాల్లో ఉన్న పేదవారిని వారికి తోడ్పడాలని ఆయన కోరారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి మండల పరిధిలోని మొట్నూతలపల్లి గ్రామానికి చెందిన రెడ్డి బోయిన గంగాధర్ కుటుంబాన్ని దత్తత తీసుకున్నారని తెలిపారు. వారి పిల్లల చదువు కోసం ఆర్థికసాయం అందించారు. పిల్లల చదువు పూర్తయ్యేవరకూ ఆ ఖర్చులు ఇస్తామని హామీ ఇచ్చారు.

## నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాల ఏర్పాటు దారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన శనివారం దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖలతోపాటు ఇతర సంబంధిత శాఖల అధికారుల నుంచి అనుమతులు పొందాలన్నారు. లైసెన్స్ లేకుండా టపాసుల విక్రయాలు చేస్తే చర్యలు తీసు కుంటామన్నారు.

**ఎర్రగుంట్ల :** అనుమతి పొంది దీపావళి టపాసుల అంగళ్ళు ఏర్పాటు చేసుకున్న వారు తప్పక నిబంధనలు పాటించాలని సీఐ విశ్వనాథరెడ్డి సూచించారు. దీపావళి సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డులో టపాసుల అంగళ్లు ఏర్పాటు చేసుకున్నారు. శనివారం పలు శాఖల అధికారులు అంగళ్ల ఏర్పాటుచేసిన ప్రదేశాన్ని సందర్శించి యజమానులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషఫణి, తహశీల్దార్ శోభన్ బాబు, ఎంపీడీవో వెంకటరమణయ్య, ఫైర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా వైద్య నారాయణ జయంతి

**ప్రజాశక్తి - ముద్దనూరు**

నాయీ బ్రాహ్మణుల కులదైవం వైద్య నారాయణ భగవాన్ శ్రీ ధన్వంతరి జయంతి సందర్భంగా శనివారం జిల్లా నాయీ బ్రాహ్మణ అధ్యక్షులు గుర్రప్ప ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ అవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భాజాభజంత్రీలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గురప్ప మాట్లాడుతూ సమాజ హితానికి, లోక కళ్యాణానికి, సంస్కృతి సంప్రదాయాలు, జాతి కీర్తిని యావత్ జగతికి చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

**వేంపల్లె :** వైద్య నారాయణ శ్రీధన్వంతరి భగవాన్ జయంతిని నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. శ్రీ సద్గురు త్యాగరాజుస్వామి గుడి ఆవరణంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పెద్ద ఎత్తున నాయి బ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు, నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వినాయక బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు వెంకటరమణ, ఉపాధ్యక్షులు గురుప్రసాద్, పీరయ్య, సిద్దయ్య, యువజన సంఘం అధ్యక్షులు ఆర్.ప్రదీప్, యూత్ ఉపాధ్యక్షులు మోపూరి రమేష్‌బాబు, హరికృష్ణ కార్యదర్శి గంగాధర, ప్రచార కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

వికలాంగులకు నిత్యావసర సరుకులను స్థానిక అమ్మవారిశాల వీధి ప్రముఖ స్వర్ణకారుడు రామాంజనేయ జ్యువెలర్స్ అధినేత పెద్దపోతుల రామాంజనేయులు ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుటుంబసభ్యులు పంపిణీ చేశారు. వికలాంగుల కమ్యూనిటీ భవనంలో రామాంజనేయులు చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 20 మంది దివ్యాంగుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. వికలాంగుల సంఘం అధ్యక్షులు భూమారెడ్డి రామాంజనేయ కుటుంబ సభ్యులకు కృతజ్ఞ తలు తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘ కార్యదర్శి సునీల్, స్వర్ణకా రులు పెద్దపోతుల పవన్‌కుమార్, గంగినాయుడు, కంచర్ల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి - ముద్దనూరు**

ముద్దనూరు-పులివెందుల రహదారి నల్లబల్లి గ్రామ సమీపంలో ఉన్న పుల్లేరు వంక వంతెన వద్ద శనివారం ఉదయం హైడ్రా వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెందాడు. సిఐ దస్తగిరి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతని వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సిఐ సూచించారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : కలెక్టర్

దువ్వూరులో సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - దువ్వూరు**

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి మండల అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం నుంచి మూడురోడ్లు కూడలి వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

**కడప అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు సర్కిల్ కార్యాలయాలు, స్టేషన్ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. సర్కిల్ కార్యాల యాలు, స్టేషన్ ఆవరణను శుభ్రం చేయడంతో పాటు డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేశారు. మొక్కలను నాటి, చుట్టుప్రక్కల ఉండే చెత్తా చెదారాలను, పిచ్చిమొక్కలను తొలగించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వైవీయులో..** పర్యావరణ సమతుల్యత మనందరి బాధ్యతని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర-దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు, విద్యార్థులు క్లీన్ ఎయిర్ చైతన్య ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ఆచార్య పద్మ ప్రారంభించి మాట్లాడారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె లలిత నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్ వెంకట్రామిరెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని అన్ని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల పీవో డాక్టర్ ఎస్.సునీత, ఆచార్యులు ఎన్.ఈశ్వర రెడ్డి, ఎ.మధుసూదనరెడ్డి, మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ముద్దనూరు :** పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపిడిఒ రాధాకృష్ణవేణి పేర్కొన్నారు. స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముద్దనూరు పంచాయతీ కార్యాలయంలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించి, పాత బస్టాండ్ కూడలిలో మానవహారంగా నిలిచి ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు, కార్యదర్శి లక్ష్మి నరసింహులు, ఎపిఒ గంగయ్య, ఎపిఎం అపర్ణ, సిసిలు ఇబ్ర హీం, రామాంజనేయ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, ఉపా ధ్యాయులు, సచి వాలయ, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

**ఎర్రగుంట్ల :** గాలి కాలుష్యం వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయని, దాని నియం త్రణకు అందరూ కృషి చేయాలని ఎంఇఒ శివప్రసాద్ తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి అవగాహన సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మండలస్థాయి అండర్-17, అండర్-14, అథ్లెటిక్స్ పోటీలు బాలుర బాలికల విభాగంలో శనివారం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2, హెచ్‌ఎం రామాంజనేయులు రెడ్డి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎం.భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రఓబులరెడ్డి, జనార్ధన్, చంద్రకాంత్, బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

**చాపాడు :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర నీటి పారుదల సంస్థ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ వీరకిషోర్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారాన్ని ఏర్పాటు చేసి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, టిడిపి నాయకులు హర్ష వర్ధన్‌రెడ్డి, నాగేశ్వ ర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాము, బయపురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఖాజీపేట :** ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మజీ ఛైర్మన్ మండల టిడిపి సీనియర్ నాయకుల ఇట్టేం శ్రీరాముల యాదవ్ సూచిం చారు. మండలంలోని మిడుతూరు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా ఆయన మొక్కల సంరక్షణ గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సచి వాలయ సిబ్బంది, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**కలసపాడు :** మహానంది పల్లె పంచాయతీలోని ఎంపీపీ పాఠశాలలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ నిర్వ హించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల ఉపా ధ్యాయుడు ఇ బాలజోజి, పంచాయతీ సెక్రటరీ వసంతకుమారి, అంగన్వాడీ టీచర్ రమాదేవి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ముందస్తు దీపావళి వేడుకలు

ముందస్తు దీపావళి వేడుకల్లో బాలాజీ హైస్కూల్

**ప్రజాశక్తి - జమ్మలమడుగు**

దీపావళి సందర్భంగా స్థానిక బాలా జీ హైస్కూల్‌లో శనివారం ముందస్తు దీపావళి పండుగను ఆ పాఠశాల డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠ శాలలో దీపాలను వెలిగించారు. కర స్పాండెంట్ నిఖిలరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. పాఠశాల ఆవరణంలో చివరగా విద్యార్థులు టపాసులు పేల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపల్ శిరీష, సీని యర్ ఉపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

**కమలాపురం :** కమలాపురం మండల పరిధిలోని శ్రీనారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శని వారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 6,7 తరగతి విద్యార్థులచే నరకాసుర వధ నాటకం ప్రదర్శించారు. రెండవ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన దీపావళి ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు బాణాసంచా పేల్చారు. స్కూల్ కర స్పాండెంట్ కె.అనంత రెడ్డి మాటాడుతూ దీపా వళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

**కడప అర్బన్ :** అక్కాయపల్లెలో ఉన్న సాయిబాబా విద్యాసంస్థలలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల సిఇఒ, 46వ డివిజన్ కార్పొ రేటర్ ఎం.వి.శ్రీదేవి హాజరయ్యారు. హెడ్ మిస్ అనిత ఫ్లారెన్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు **పాల్గొన్నారు.** కెఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో.. దీపావళి దివ్వెలు వెలుగులతో అం దరి లోగిళ్ళు ఎలా ప్రకాశిస్తాయో అలాగే అం దరి జీవితాలలో సంతోషాలు విరజిమ్మాలని కందుల గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి ఆకాంక్షించారు. కెఎల్ఎం మహిళా ఇంజి నీరింగ్ కళాశాలలో ముందస్తు దీపావళిసం దర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని నరకాసుర వధ చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. రత్నమ్మ, అన్ని శాఖల అధిపతులు, బోధన, బోధ నేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

**వేంపల్లె :** స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి తెలిపారు. ముందుగా పూజా కార్యక్రమంతో ప్రారంభించి దీపాన్ని వెలిగించి సంబరాలు చేశారు. అనంతరం వివిధ వేషా ధారణలతో విద్యార్థులు తమ ప్రతిభను ప్రద ర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కరస్పాండెంట్ ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

కమలాపురం : శ్రీనారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో..

కడప అర్బన్ : సాయిబాబా స్కూల్లో..

కడప అర్బన్ : నరకాసురుని వధ చేస్తున్న కందుల చంద్రఓబుల్‌రెడ్డి

## పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలి

**ప్రజాశక్తి - చాపాడు** : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రికార్డుల గదిని శనివారం ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీకి సంబంధించిన ప్రతి రికార్డును జాగ్రత్తగా ఉంచాలన్నారు. గ్రామాలలో వచ్చే ఏడాదికి పనులు గుర్తించాలన్నారు. పండ్ల తోటల పెంపకాలపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో వైసిపిదే గెలుపు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్ :** పులివెందుల ప్రజల అభిమానం, ఆశీస్సులతో మున్సిపల్ ఎన్నికల్లో వైసిపికి ప్రధాన బలం, బలగమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. 33వార్డుల్లో పోటీ చేస్తామని, వందశాతం గెలుస్తామని శనివారం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడూరు చిన్నప్ప, నూరుబాషా సంఘ అధ్యక్షులు ఒత్తురు రసూల్, సర్వోత్తమ్‌రెడ్డి, నంద్యాల హేమదిరెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ జడ్‌పిటిసి ఉపఎన్నికలో పులివెందుల మండల ప్రజా ఓట్లతో మీరు గెలిచారని, కాణిపాకం వినాయకుడి మీద ప్రమాణం చేసి చెప్పగలరా అని టిడిపి నాయకులనుద్దేశించి పేర్కొన్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి బీటెక్ రవి టిడిపి వారిని తెచ్చుకొని అప్రజాస్వామికంగా ఎన్నికలు జరుపుకున్నారని తెలిపారు. పులివెందులపై ఉన్న మమకారంతోనే నేటికీ అభివృద్ధి కోసం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి తమ సొంత నిధులు, ఎంపీ నిధులతో ఆగిపోయిన ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 18 నెలలు పూర్తి కావస్తున్నా మీ చేతకాని పాలనతో రియల్ ఎస్టేట్ ధరలు పెరిగే అవకాశం లేకుండా చేశారన్నారు. ఆత్మస్తుతి పర నిందలో కాలం గడుపుతున్నారని వైసిపి నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో బిసి సెల్ కన్వీనర్ కార్తీక్, కౌన్సిలర్‌లు ఖాదర్, రాజశేఖరరెడ్డి, కో-ఆప్షన్ చంద్రమౌళి, రామలక్ష్మణ్ రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్:** కష్టపడి చదివితే ఏ విజయాన్నైనా సాధించవచ్చునని హెచ్‌ఒడి మురళి పేర్కొన్నారు. 2010లో జేఎన్టీయూ కాలేజి మొదటి బ్యాచ్ పూర్తి చేశారని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎంతో ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారని, వీరు కూడా వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతస్థాయికెదగాలని ఆయన కోరారు. పులివెందుల జేఎన్టీయూ కాలేజీలో నిర్వహించే సర్వజ్ఞ-2కె25 శనివారం చివరి రోజులో భాగంగా వివిధ టెక్నికల్, వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు. వారిలో గెలుపొందిన వారికి, పూర్వ విద్యార్థులైన మొదటి బ్యాచ్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపల్ శేషమేశ్వరమ్మ, డిపార్ట్మెంట్ హెచ్‌ఒడి డాక్టర్ మురళి, కో-కన్వీనర్స్ ఎస్.రాధాకృష్ణ, ఎస్. జెస్సికా సరిత, కో-ఆర్డినేటర్స్ మహేంద్రరెడ్డి, ముని లావణ్య, చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాస్

## 'ఉపాధి' వేతనాలు ఎటు వెళుతున్నాయి..?

**ప్రజాశక్తి - జమ్మలమడుగు**

ఉపాధి కూలీల వేతనాలు ఎటు వెళుతున్నాయి అధికారులకా.. అన ర్హులకా.. అని సిపిఎం పట్టణ కార్యదర్శి గోపాల్‌దాస్ ఏసుదాస్ ప్రశ్నించారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంలోని చుట్టుపక్కల ఉన్న పెద్దముడియం, మైలవరం, జమ్మల మడుగులో నిరుపేదలు ఉపాధి కూలీలుగా పనులు చేసుకుంటున్నా వారికి వేతనాలు ఇవ్వలేదన్నారు. సొంత పనులు చేసుకొనే వారికి నేరుగా వారి అకౌంట్లోకి ఈ చెల్లింపులు చేరుతున్నాయన్నారు. ఈ చెల్లింపుల్లో అధికారులకు ఎంతెంత వెళ్లాయో తెలియడంలేదన్నారు. ఇలా వెళ్లిన వాటిలో మైలవరం మండలంలో ఒకటన్నారు. దాదాపు 90 కుటుంబాలు పనులకు వెళ్లకుండా ఉన్నవారికి వారి అకౌంట్ లోకి రూ.1,94,583 జమ అయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కడప జిల్లాను కరువుగా ప్రకటించిందని గుర్తు చేశారు. ఈనేపథ్యంలో ఉపాధి వేతనాలు అక్రమార్జనకు గురి కావడం, పూర్తిస్థాయిలో పేదవారికి అందలేదని స్పష్టంగా తెలుపుతున్నామన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారిం చాలన్నారు. బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యుడు ఎ.వినయ్‌కుమార్, కార్యకర్తలు నూర్‌బాషా, దస్తగిరి, గురుమోహన్ పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకుందాం : సిఐటియు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

ఉన్మాదుల నుండి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సిఐటియు నాయకులు సూచించారు. స్థానిక గపూర్ డ్రైవింగ్ స్కూల్‌లో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్ట్ 52వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై మతోన్మాది నిరసిస్తూ ఈనెల 19న ఆదివారం కడప ఓల్డ్ రిమ్స్ బీసీ భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు గఫూర్, సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు పిలుపునిచ్చారు. న్యాయ నిపుణులు, ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు, విద్యార్థి, యువజన, మహిళ, దళిత, ముస్లిం, మైనారిటీ వర్గాల నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ సింహాద్రిపురం మండల కార్యదర్శి అమీర్ బాషా, సిపిఐ నాయకులు సుభాన్ పాల్గొన్నారు.

## క్లాసిక్ బేకరిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు**

స్థానిక తాడిపత్రి రోడ్డులో ఉన్న క్లాసిక్ బేకరిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యాజమాన్యం కేక్, బేకరీలో కొన్ని సరుకులు కస్టమర్లకు తూకం తక్కువ ఇస్తున్నారని శుక్రవారం లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వ హించి కేసు నమోదు చేసి అపరాధ రుసుం విధించిన సంగతి తెలిసిదే అన్నారు. ప్రధానంగా నమ్మకంతో ప్రజలు కేక్, స్వీట్స్ తక్కువ తూకం చూపి మోసం చేయడం దారుణమన్నారు. కేవలం అదొక్కటే కాదని ఫుడ్ సేఫ్టీ అధి కారులు పట్టణంలోని ఇతరా బేకరీలలో కూడా ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన వా టిని తనిఖీలు నిర్వహించి ల్యాబ్‌కు పంపించాలని కోరారు. కేవలం జరిమానా వి ధించి నోటీసులు ఇవ్వడం కాదని, లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించి ప్రజా ఆరోగ్యం కాపాడాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## సాగు పట్టాలు మంజూరు చేయాలి

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

సోమిరెడ్డిపల్లి గ్రామ రెవెన్యూ పొలంలోని చీటీపాయలో పేదలు సాగు చేసుకుంటూ అనుభవంలో ఉన్న భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని, అసైన్‌మెంట్ ద్వారా కాకుండా ఆన్‌లైన్ చేయించుకున్న భూములను రద్దు చేయాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఆ మేరకు శనివారం తహశీల్దార్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు హరి, సుబ్బమ్మ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

**ప్రొద్దుటూరు :** స్థానిక మిట్టమడి వీధిలోని రవీంద్ర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ అందరినీ ఆకట్టుకుంది. నాలుగో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులు తమ మేధాశక్తిని ఉపయోగించి రూపొందించిన పలు నమూనాలను అందరూ ఆసక్తిగా తిలకించారు. కెమికల్ ఇండస్ట్రీ, హైడ్రాలిక్ జెబిబి, క్రేన్, థర్మల్ పవర్ ప్రాజెక్ట్, రెయిన్ వాటర్ హార్వె స్టింగ్, వాటర్ ప్యూరిఫైర్, ఆటోమేటిక్ అలారం, వోల్కనో ఎరక్షన్ వంటి 154 వర్కింగ్ మోటర్స్, 56 మోడల్స్‌ను 300 మంది విద్యార్థులు రూపొందించారు. పాఠశాల వ్యవస్థాపకుడు పల్లెటి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా ర్థులలో సృజ నాత్మకతను, ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ప్రతి ఏడా ది సైన్స్ ఫె యిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పల్లేటి విష్ణుకుమార్ రెడ్డి, డైరెక్టర్ సౌజన్య లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు ఖాదరవల్లి, పుష్పవాణి, ఉపా ధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.


**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ నీటి పారుదల సంస్థ : కడప విభాగము**

**షార్ట్ టెండర్ ప్రకటన**

Tender Notice No:07/EE/RIC/KDP/2025-26 తేదీ : 18.10.2025

వైఎస్ఆర్ కడప జిల్లా యందు 44.00 లక్షల అంచనా విలువ గల వివిధ గ్రాంట్స్ క్రింద మంజూరు అయిన 07 పనుల కొరకు సీలు వేసిన టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ షెడ్యూల్ దరఖాస్తు చివరి తేదీ 22.10.2025 టెండర్ స్వీకరణకు చివరి తేదీ 25.10.2025 మ 3.30 గంటల వరకు. మిగతా వివరములకు కార్యాలయ పని వేళ యందు సంప్రదించవలసినదిగా కోరడమైనది.

**కార్యనిర్వాహక ఇంజనీర్**



**IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: KADAPA**

**E.P.No. 204/2024**

**O.S.No. 14/2020**

T. Suresh, S/o T.Saibaba, aged about 48 years, Hindu, Govt. Employee, residing at D.No.20/607, R.K.Nagar, Kadapa. **...DHR/Plaintiff**

**Vs**

A. Isaiah, S/o A.J.Prakasha Rao, aged about 45 years, Hindu, Home-guard No.HG 239, Residing at D.No.20/973, Co-Op-Colony, Kadapa, Presently residing at D.No.2/262-13-1, Maruthi Nagar, Beside Hero Honda Show Room, Kadapa, presently working at Superintendent of Police Office, Kadapa. **...JDR/Defendant**

**NOTICE TO JDR IN U/O 21 R 22 OF CPC**

పై తెలిపిన DHR, JDR అయిన మీ పైన పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట E.P.No. 204/2024 అను కేసును వేసియున్నారు. సదరు కేసులో మీ యొక్క హాజరు కొరకు వాయిదాను 6.11.2025వ తేదీకి వేసియున్నారు. కావున 6.11.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకొనవచ్చు ను. లేనంతట మీ పరోక్షములో కేసు తీర్మానించబడును.

**//By Order of the Hon'ble Court//**

**ఎస్. లలిత**
అడ్వకేట్, కడప.



**మహారాజశ్రీ ప్రొద్దుటూరు MOTOR VEHICLE ACCIDENT CLAIMS TRIBUNAL-II అదనపు జిల్లా జడ్జి, KADAPA AT PRODDATUR**

**M.V.O.P.No. 168/2017**

షేక్ రుక్సాన, W/o షేక్ ఖలీల్ బాష, వయసు 40 సం॥లు, గృహిణి, ముస్లిం, డోర్ నెం.15/647, మేడంపల్లి, ప్రొద్దుటూరు పట్టణం & మండలం, కడప జిల్లా. **...Claimant**

**Vs**

పల్లా గుర్రమ్మ, W/o చిన్న పుల్లయ్య, Age above 50 years, D.No.6/63, మెయిన్ రోడ్డు, దువ్వూరు- పట్టణం & మండలం, కడప జిల్లా.
C/o పల్లా నరేంద్ర, Working in S.B.I., Indian Bank పక్కన గాంధీ రోడ్డు, ప్రొద్దుటూరు.

**...11th Respondent**

**దావా సమను మరియు నోటీసు**

పై నెంబరు దావాలో క్లైమెంట్ మీ పైన మరియు కొంత మందిపైన కేసు నమోదు చేయబడినది. అట్టి దావాలో మీరు 28.10.2025 నాడు పై కోర్టులో ఉదయం గం.10.30ని॥లకు మీరు కాని మీ వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

**వాయిదా తేది: 28.10.2025**

**//By Order of the Court//**

**C.V.SURESH**
**Advocate,**
**PRODDATUR, YSR Dist. A.P.**



**మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు**

**O.S.No. 284/2024**

మజ్జారి సుబ్బలక్ష్మి, D/o వెంకటరమణ, హిందూ, 34 సం॥లు,డోర్‌నెం.12/44, ఉమ్మారెడ్డిపల్లి, ముద్దనూరు మండలం. **...వాది**

**Vs**

2. రోసిగాళ్ళ @ రోసిగారి ప్రవళిక, D/o జయప్రతాప్, 32 సం॥లు, డాక్టరు డోర్ నెం.24/1208, ఈశ్వరయ్యనగర్, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర, జమ్మలమడుగు.
4. రోసిగాళ్ళ @ రోసిగారి ప్రత్యూష, D/o జయప్రతాప్, హిందూ, 28 సం॥లు, డోర్‌నెం.24/1208, ఈశ్వరయ్య నగర్, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర, జమ్మలమడుగు.

**...2,4 ప్రతివాదులు**

**సమను/నోటీసు**

పై నెంబరు దావాను మొత్తం రూ.4,86,000/- వగైరాలు రాకోరి ప్రతివాదులు 2,4 అయిన మీ పైన వాది దావా దాఖలు చేస్తు I.A.No.708/2024 వ పిటిషన్‌ను పిటిషన్ షెడ్యూలు దాఖల మీ తండ్రి గారు చనిపోయినందున ఆయనకు రావలసిన Earn Leave Salaryని తీర్పునకు ముందు జప్తి చేయలాగున దాఖలు చేసివున్నారు. అట్టి పిటిషన్ యందు దావా యందు 2,4 రెస్పాండెంట్లు/2,4 ప్రతివాదులు అయిన మీకు ఏవైనా ఆక్షేపణలు వున్న యెడల 7.1.2026వ తేదీన స్వయంగా కానీ లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును అని ఇందుమూలంగ తెలియజేయడమైనది.

**వాయిదా తేది: 7.1.2026**

**//By Order of the Court//**

**ఎన్.వి.వరప్రసాద్**
అడ్వకేట్, ప్రొద్దుటూరు.



**మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**O.S.No. 526/2022**

Union Bank of India, rep represented by its Branch Manager, zinna Road Branch, Proddatur Town, Kadapa District. **...Plaintiff**

**Vs**

1. Chittiboyana Khadharaiah S/o Khadharaiah 45 years D.No.2/62, Peddapasupula Village, Pedda mudiam Mandal, Kadapa Dist. Sri sainath ware House Godowns partners 2 to 5
2. Bapathi Venkata Ramana Reddy, S/o Pedda Konda Reddy, 42 years, D.No.3/83, Peddapasupu la Village, Peddamudiam Mandal, Kadapa Dist.
3. Bapathi Shamala Devi, W/o Venkata Ramana Reddy, 40 years, Godown Proprietor, D.No.3/83, Peddapasupula Village, Peddamudiam Mandal, Kadapa Dist.
4. Bapathi Venkateswara Reddy, S/o Pedda Konda Reddy, 47 years, D.No.3/83, Peddapasupu la Village, Peddamudiam Mandal, Kadapa Dist.
5. Bapathi Narayana Reddy, S/o Chinna Konda Reddy, 45 years, residing Peddapasupula Village, Peddamudiam Mandal, Kadapa Dist.

**...Defendants**

**దావా సమను**

పై నెంబరు దావాను ప్రతివాదులు పైన దావా రికవరీకి గాను దావా దాఖలు చేయడమైనది. దావాలోని ప్రతివాదులు 1to5 అయిన మీరు పై కోర్టులో 03.11. 2025వ తేదిన ఉదయం 10.30 ని॥లకు మీరు గాని మీ తరపున వకీలు గారు కానీ హాజరు కావలెను. అట్లు హాజరు కానంతట మీ పైన పరోక్షంగా తీర్మాణించబడును.

**వాయిదా తేది: 03.11.2025.**

**//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//**

**మెట్టుపల్లి సుధాకర్ రెడ్డి**
అడ్వకేట్, ప్రొద్దుటూరు. సెల్: 9849226642.



**మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు : ప్రొద్దుటూరు**

**I.A.No.: 424/2025**

**A.S.No.35/2024**

మూలె రఘునాదరెడ్డి, S/o గోవింద రెడ్డి, హిందూ 64 సం॥లు, డోర్‌నెం.26/20-201, 7వ లైన్, గుంటూరు, సెల్‌నెం. 9390753512. **...పిటిషనర్/అప్పిలెంట్**

**Vs**

6. మూలె శ్రీకాంత్ రెడ్డి, S/o మూలె వెంకట రామిరెడ్డి, 38 సం॥, ప్రైవేట్ ఉద్యోగం, Flat No B2, A Block, హరివిల్లు అపార్ట్‌మెంట్, రాజేశ్వరి కాలని, ప్రొద్దుటూరు.
7. మూలె సుమంత్ రెడ్డి, S/o మూలె వెంకట రామిరెడ్డి, హిందూ 37 సం॥లు,
8. మూలె జ్యోతి, D/o ములె వెంకట రామిరెడ్డి, హిందూ, 35 సం॥
సాకిన్ ఇద్దరు,Flat No B2, A Block,హరివిల్లు అపార్ట్‌మెంట్ చైతన్య స్కూల్ రోడ్డు, రాజేశ్వరి కాలని, ప్రొద్దుటూరు.

**...6,7,8 రెస్పాండెంట్లు**

**నోటీసు**

పై నెంబరు పిటిషన్‌ను R6, R7, R8 రెస్పాండెంట్స్ అయిన మీ తండ్రి గారు చనిపోయినందున ఆయన వారసులుగా అప్పీలు నందు మిమ్ములను చేర్చకోరుచూ మరియు అట్టి పిటిషన్ దాఖలు చేయుటలో కలిగిన 208 రోజుల ఆలస్యంను మన్నించకోరుచూ I.A.No.426/2025వ పిటిషన్‌ను మరియు abatement Setaside కోరుచూ I.A.No. 425/2025వ పిటిషన్‌ను దాఖలు చేసివున్నారు. అట్టి పిటిషన్ల యందు R6 to R8 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల 25.11.2025వ తేదీన ఉ॥10.30గం॥ స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా గానీ పై కోర్టు యందు హాజర్రై తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

**వాయిదా తేది: 25.11.2025**

**//By Order of the Court//**

**ఎన్.వి.వరప్రసాద్**
అడ్వకేట్, ప్రొద్దుటూరు.



**IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, JAMMALAMADUGU**

**O.S.No. 61/2023**

Thegalapalle Rami Reddy, aged 57 years, S/o Tirupathi Reddy, Hindu, D.No.1-9-110/1, Kushia guda Kapra ECI Post, Hyderabad at Present residing at Dommaranandyala Village, Mylavaram Mandal, Kadapa District. **...Plaintiff**

**Vs**

**D16.** Kunda Suresh, aged about 38 years, S/o Krishnaiah, Hindu, residing at D.No.23/374, Nagulakatta Street, Jammalamadugu Town and Mandal, Kadapa District.
**D17.** Badiginchala Venkateswarlu, aged about 35 years, S/o Narasimha Rao, Hindu, residing at D.No.9/64-G-1, Dommaranandyala Village, Mylavaram Mandal, Kadapa District.

**...Defendants No.16 & 17**

**16వ మరియు 17వ ప్రతివాదులకు దావా సమను మరియు నోటీసులు**

ఈ నెంబరు దావాలోని వాది, 16 మరియు 17వ ప్రతివాదులు పైన రాజశ్రీ పై కోర్టు యందు దావా షెడ్యూలు ఆస్థి యందు వాదికే హక్కు, బాధ్యతలు ఉన్నాయని దావా దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావాతో పాటు I.A.No.374/2025 మరియు I.A.No.375/2025 పిటిషన్ల ద్వారా షెడ్యూలు ఆస్థి పై ఇంజక్షను పిటిషన్లు కూడా దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావాలో మరియు పిటిషన్‌లలో 16, 17వ రెస్పాండెంట్లు/ ప్రతివాదులు అయిన మీకు 28.10.2025 నాడు వాయిదా ఉన్నది. అట్టి తేది నాడు ఉదయం 10.30 ని.లకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెల్పుకోవలసినది. లేనంతట మీ పరోక్షముగా తీర్మానించబడును.

**వాయిదా తేది: 28.10.2025**

**//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//**

**AKKILI SANJEEVA KUMAR**
**Advocate,**
**PRODDATUR.**
**Cell: 9000750376.**